# తప్పు వయసుది!

ఒకే వయసువాళ్ళ మధ్య స్నేహం బాగా వృద్ధి చెందుతుంది అని నా గట్టి నమ్మకం.

రావుతో పరిచయం కాకుండా వుంటే ఇంకా ఆ నమ్మకంలోనే వుండేవాణ్ణి. కానీ వయసుకీ, స్నేహానికీ ఎటువంటి సంబంధమూ లేదు అనే విషయాన్ని అతన్తో పరిచయమైన ఈ ఆర్నెల్ల కాలం ధృవపరిచేసింది.

ఉద్యోగరీత్యా నేను హైదరాబాద్ చేరుకుని ఆర్నెల్లైంది. ఈ ఆర్నెల్లలో కనీసం అరవైమందైనా పరిచయమయ్యారు. కానీ ఎవ్వరితోనూ పెంపొందని స్నేహం రావుతోనే పెంపొందింది.

అతను నాకన్నా ఏడెనిమిదేళ్ళు పెద్దవాడు!

వయసులోనే కాదు, వుద్యోగంలో కూడా అతను నా పైమెట్టుమీదే వున్నాడు! కాకపోతే ఇద్దరం వుండడం ఒకే ఏరియాలో.

ఆఫీస్‌లో కాకుండా వచ్చేప్పుడు, వెళ్ళేప్పుడు కూడా కొంత సమయాన్నికల్సివెచ్చించాల్సివచ్చేది.

సక్రమంగానే పరిచయం పెరిగి ఒకళ్ళ ఇంటికి మరొకళ్ళ రాకపోకలు మొదలయ్యాయి.

వంటరిగాణ్ణి-నారూమ్ అతనికి ఏమైనా రిలీఫ్‌ని ఇచ్చేదో లేదో గాని, వాళ్ళింటికి వెళ్ళడం నాకు మాత్రం 'హోమ్‌సిక్'ని దూరం చేసేది.

శారద అన్ని విధాలా అతనికి తగ్గ భార్యే!

వాళ్ళిద్దరి ఆప్యాయత, నా హైద్రాబాద్ జీవితానికి జీవాన్ని ఇచ్చింది.

వీళ్ళతో పరిచయం కాకుండా వుంటే ఉద్యోగంలో చేరిన మర్నాటినుంచే మా వూరి వేపు ట్రాన్స్ఫర్ చేయించుకోవడానికి ప్రయత్నించే వాణ్ణేమో!

ఆఫీస్కి శలవు వచ్చిందంటే వాళ్ళింటికి భోజనానికి వెళ్ళక తప్పదు....

భోజనం.... కబుర్లు..... పేకాట.... సినిమా.....

ఇట్టే గడిచిపోతుంది రోజు!

అలవాటు ప్రకారం ఆ ఆదివారం నాడు పదిగంటల కల్లా బయల్దేరాను రావు వాళ్ళింటికి.

దార్లో చలపతి నిలబెట్టేశాడు.

డిగ్రీ అయింతర్వాత అదే అతన్ని కలవడం!


ఆ కబుర్లు, ఈ కబుర్లు...

గంట గడిచిపోయింది......!

పదకొండు!

ఆఫీస్కైనా ఆలశ్యంగా వెళ్ళుగాని మా ఇంటికి వచ్చేప్పుడు మాత్రం ఆలశ్యంగా రావద్దనే వార్నింగ్ని రావ్ ఎప్పుడో ఇచ్చాడు! ఇంకా నేనెందుకు రాలేదా అని వాళ్ళిద్దరూ ఎదురు చూస్తుంటారు. ఇంక ఆలశ్యం చెయ్యటం బావుండదు.

మళ్ళీ కలుస్తానని, చలపతి అడ్రస్ తీసుకొని రావు ఇంటివేపు బయల్దేరాను.



ఇవాళ అతని చేతిలో చివాట్లు తప్పవు.

ఆలోచనల్తో సంబంధంలేకుండా అడుగులు గబగబా పడసాగాయ్.

రావు ఇంటికి చేరుకోవడానికి మరో ఐదు నిముషాలు పట్టాయ్.

వాళ్ళింటికి వేళ్ళాడుతున్న తాళాన్ని చూడగానే గుండె ఝల్లుమంది-

కొంపదీసి వీళ్ళు నాకోసమే వెళ్ళ లేదు కదా?

రకరకాల ఆలోచనల్తో వెనుదిరిగాను.

"ఏయ్ రఘూ....!" వెనుకనించీ వచ్చిన కేకతో అడుగు ముందుకు పడలేదు.

చటుక్కున వెనక్కి తిరిగాను.....

వాళ్ళ పక్క వాటాలోంచి బయటికొచ్చాడు రావ్.

అదేమిటి! సాధారణంగా అతను వాళ్ళింటికి వెళ్ళడే! అదీ ఆదివారం నాడు - ఈ సమయానికి....!

ఆశ్చర్యాన్నించీ తేరుకోకముందే అతను నన్ను చేరుకున్నాడు.

"ఇవిగో తాళం చెవులు నువ్వెళ్ళి లోపల కూర్చో.... నేనూ, శారదా మరో పదినిముషాల్లో వస్తాం....." తాళం చెవులు చేతిలో పెట్టాడు.

"శారదగారు కూడా వాళ్ళింట్లోనే వున్నారా......" ఆ విషయం అర్థమైపోతూనేవున్నా, ఎందుకక్కడ వున్నారు అని అడగలేక అలా అడిగాను.

"మా ఇంటాయన కూతురు కమలని నువ్వు చూసే ఉంటావ్.... ఆ అమ్మాయిని చూట్టానికి ఇవాళ ఎవరో వచ్చారు......"

"అయితే మీరెందుకు......"

"ఈ విషయాల్లో ఆయనకి ఎవరైనా తోడు వుంటే బావుండుననిపించినట్లుంది. నన్ను రమ్మన్నాడు..... మేమో పదినిముషాల్లో వచ్చేస్తాము. నువ్వింట్లోకి వెళ్ళు...." ఎంత త్వరగా వచ్చాడో అంత త్వరగాను తిరిగి పక్క వాటాలోకి వెళ్ళిపోయాడు.

ఇక చేసేది లేక నెమ్మదిగా రావ్ ఇంటి తాళం తీసి, లోపల పడకకుర్చీలో కూలబడ్డాను.

ఈ పెళ్ళిచూపుల తతంగంమీద నాకే మాత్రం మంచి అభిప్రాయం లేదు.

ఎవరెవరో వస్తారు. నఖశిఖ పర్యంతం ఆ ఆడపిల్లని పరీక్షిస్తారు. అన్నిటినీ భరిస్తూ ప్రాణం లేని వస్తువులా పడుండాల్సిందే ఆడపిల్ల!ఆమె అభిప్రాయాల్ని గమనించే మనిషే వుండడు-చివరికి ఆ పిల్ల తండ్రి కూడా!

ఇంత తతంగం నడిచిన తర్వాత కూడా ముఖ్యమైన బేరం కుదరక పోయిందా..... గోవింద.....!

మళ్ళీ ఆ ఆడపిల్ల మరి కొంతమంది పరీక్షలకు గురి కావల్సిందే

పెళ్ళిచూపులు అయిందగ్గర్నుంచీ అతన్నే తన భర్తగా వూహించుకుని ఎన్నో కలలు కంటారు ఎంతో మంది ఆడపిల్లలు. తీరా అతను చేసుకోననేసరికి బలవంతాన ఆ కలలకి ఆనకట్టవేయాలి. తిరిగి మరో పెళ్ళికొడుకు.... మరి కొన్ని కలలు...

ఇలా ఆడపిల్లల్ని హింసించే మగవాళ్ళంటే వళ్ళుమంట నాకు. ఆ విషయం రావ్‌కి తెల్సు. తెలిసికూడా నేను వచ్చింతర్వాత కూడా రావ్

అలా పెళ్ళిచూపుల కార్యక్రమంలో మునిగిపోవడం ఏం నచ్చలేదు నాకు.

మరొకళ్ళూ మరొకళ్ళూ అయితే నేనంతగా పట్టించుకునేవాణ్ణి గాను. నాకు ఆత్మీయుడు, ఆదర్శ భావాలు గల వ్యక్తి అయిన రావ్ కూడా వాళ్ళింటాయన లాంటి వాళ్ళని ప్రోత్సహించడమేమిటి? ఈ విషయంలో నా నిరసనని రావ్ రాగానే చెప్పేయాలి.....

"ఏమిటోయ్.... మనుషులొచ్చింది కూడా గమనించకుండా తెగ ఆలోచించేస్తున్నావ్....!" నా ఆలోచనల్లో రావ్ వచ్చింది కూడా గమనించలేదు.

"అన్నయ్య గారికి మనమీద కోపం వచ్చి ఉంటుంది" వెనకే వచ్చిన రావ్ భార్య శారద చిన్నగా నవ్వింది.

"అవును! వచ్చింది.... మీరు కూడా ఇలాంటి వాటిని ప్రోత్సహించడం నాకేమీ బావుండ లేదండీ....." శారద వంక చూస్తూ అన్నాను. ఎంత అణచుకోవాలని ప్రయత్నించినా కోపం గొంతులోంచి బయట పడనే పడింది.

ఆ తర్వాత ఆ విషయం మీద వాళ్ళకీ, నాకు మధ్య ఎంతో వివాదం నడిచింది. మామూలుకి భిన్నంగా ఆ రోజు కొంత అనీజీగా గడిచింది నాకు.

సరిగ్గా ఈ సంఘటన జరిగిన నెల రోజుల కనుకుంటాను-లంచవర్లో టీ తాగుతున్నప్పుడు "రేపాదివారం పది గంటలకల్లా నువ్వు మా ఇంటికి వస్తున్నావ్" రావ్ మాటలు వింతగా అనిపించాయి నాకు.

"ప్రతి ఆదివారం మా ఇంటికి రావడం మామూలేగా! ఇవాళ మళ్ళీ ప్రత్యేకంగా చెప్పడం ఎందుకు"? అడిగాను అర్థంగాక.

"ఈసారి నువ్వు వచ్చేది ప్రత్యేకమైన హోదాలో....!"

"అంటే?"

"నువ్వు మా ఇంటికి వస్తుంటే నిన్నెన్నో సార్లు చూసాడు మా ఇంటాయన. వాళ్ళమ్మాయి కమలకి నీ సంబంధమైతే బావుంటుందని ఆయన ఆశ. అందుకని నిన్నెలాగైనా వప్పించి రేపాదివారం పెళ్ళిచూపులు ఏర్పాటు చేయమని ఎంతగానో ప్రాధేయపడ్డాడు......"

రావ్ మాటలకి కొరడాతో వీపుమీద కొట్టినట్లు వులిక్కిపడ్డాను.

వళ్ళు మండిపోయింది.

నాకి పెళ్ళిచూపుల భాగోతం అంటే చికాకనే విషయం అతనికి తెలుసు. పైగా వాళ్ళింటాయన కూతురు పెళ్ళిచూపుల విషయంలోనే ఒకసారి మా ఇద్దరి మధ్య స్పర్థ వచ్చింది. ఈ విషయాలన్నీ మరిచిపోయి రావ్ నన్ను పెళ్ళి చూపులకి పిలవడం ఆశ్చర్యంతో పాటు కోపాన్నీ కలిగించింది. వెంటనే ఆ కోపాన్ని మాటల ద్వారా వెళ్ల గక్కేశాను.

"నాకి పెళ్ళి చూపులంటే సదభిప్రాయం లేదనే విషయం నీకు తెల్సు అయినా నువ్వు నన్నిలా పిలవడంలో అర్థంలేదు...."

నా మాటలు రావ్‌ని బాధించినట్టున్నాయి. అతను మారు మాట్లాడలేదు.

రావే బిల్ చెల్లించాడు. ఇద్దరం రోడ్డు మీద కొచ్చాం. నెమ్మదిగా ఆఫీస్ వేపు నడక సాగించాం.

అతను మౌనం.....

నాకూ కల్పించుకుని మాట్లాడాలనిపించలేదు.

నిశ్శబ్దం.....

రోడ్డు రకరకాల శబ్దాలతో మారు మోగుతున్నా మా ఇద్దరి మధ్యా నిశ్శబ్దం...

దూరం తరిగిపోతోంది.....

ఆ నిశ్శబ్దం మా ఇద్దరి మధ్యా దూరాన్ని పెంచుతోందేమో ననిపించింది హఠాత్తుగా.

వెంటనే "రావ్...." పలకరించాను.

రావ్ జవాబియ్యలేదు.

మళ్ళీ పిల్చాను.

జవాబు లేదు.

దాంతో అతనికి కోపం వచ్చిందేమోననే అనుమానం వచ్చి మొహం కేసి చూశాను.

ఆ పక్కనే ఉన్న బస్ స్టాప్‌కేసి చూస్తున్నాడు. నా కళ్ళూ అటు తిరిగాయి.

అక్కడో పదహారేళ్ళ పడుచు నిలబడుంది. అప్పుడే విచ్చుకుంటున్న పువ్వులా ఉన్న ఆమె అందం ఎవరినైనా ఆకర్షించి తీరుతుంది. తను తొడుక్కున్న పంజాబీ డ్రస్‌లో ఆమె అందం మరింత విజృంభించిటది. చేతిలోని పుస్తకాల్ని తన అందాలు ఎవరికీ కనబడ కూడదన్నట్టు గుండెలకి అడ్డం పెట్టుకుంది.

"ఆ అమ్మాయి చాలా బావుంది కదూ....." అన్నా నప్రయత్నంగా.

దానికి జవాబియ్యలేదు రావ్.

"ఇట్లాంటి ఆడపిల్లల్ని చూస్తే ఎవరికయినా మతిపోతుంది తప్పదు....." మళ్ళీ నేనే అన్నాను.

అదీ విన్నట్టులేడు రావ్.

ఆ అమ్మాయి వంకే చూస్తూ "మరో నాల్గయిదేళ్ళు పోతే మా పెద్దమ్మాయీ ఇలానే స్కూల్‌కి బయల్దేరుతుందేమో...." అన్నాడు.

ఉలిక్కిపడ్డాను.

ఇద్దరం మగవాళ్ళమే-కాకపోతే వయసులో కొద్దిగా తేడా. అంతే!

ఆ అమ్మాయిలోని యవ్వనాన్ని నేను వెదుకుతుంటే, కూతురితో పోల్చుకుంటూ అతను చూస్తున్నాడు.

నా ఆలోచన నాకే సిగ్గనిపించింది.

రావ్ నా మాటల్ని వినలేదు కాబట్టి సరిపోయింది. వింటే ఎంత నీచంగా అనుకునేవాడో....

వెంటనే నా అంతరాత్మ అందుకు ఎగురు తిరిగింది.

ఎందుకు అసహ్యించుకుంటాడు? అతనికి పెరుగుతున్న ఆడపిల్లలున్నారు కాబట్టి అందరి ఆడపిల్లల్లోను అతను కూతుళ్ళనే చూసుకోగలడు-మరి నేనో...... పెళ్ళి కావలసిన వాణ్ణి. అందుకే కనిపించిన ప్రతి ఆడపిల్లలోనూ అందాలు వెదుక్కుంటున్నాను...... అందులో తప్పేం లేదు. తప్పు వయసుదే!

వెంటనే రావ్ వాళ్ళింటాయన గుర్తుకొచ్చాడు. ఆయన కూతురుకి పెళ్ళి చెయ్యాలి. అందుకనే కాస్త యోగ్యతున్న యువకుడు కనిపించగానే అల్లుడవు తాడేమోననే ఆశతో పెళ్ళి చూపులకు పిలుస్తున్నాడు-అందులో అతనిదీ తప్పులేదు.

"రావ్... రేపాదివారం నువ్వు చెప్పినట్టుగానే పెళ్ళి చూపులకు వస్తున్నాను. ఆ విషయాన్ని ఆయనకి తెలియజెయ్....." అన్నాను వెంటనే.

ఇందాక పెళ్ళిచూపుల పేరెత్తగానే అంతగా చికాకు పడిపోయిన నేనేనా వెంటనే ఇలా మాట్లాడింది అనిపించినట్టుంది అతనికి!

నామొహం కేసి ఆశ్చర్యంగా చూశాడు.

ఠక్కున తలకిందికి దించాను. "నేనేదో బాధపడతానని నువ్వు రావద్దు...." ఆఫీస్ మెట్లెక్కుతూ అన్నాడు రావ్.

"నీకోసం వస్తానని నేనేమీ అనడంలేదు, మనస్ఫూర్తిగా రావాలనిపించే చెప్తున్నాను. కాకపోతే హడావిడి పడి పెద్దగా ఏర్పాట్లు మాత్రం చేయవద్దని చెప్పు.... మళ్ళీ కలుస్తా...." గబగబా నా సీట్ వేపు అడుగులు వేశాను.

*

(జ్యోతి మాస పత్రిక - సెప్టెంబరు 1981)